31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 పేజీలు : 8

## జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ అధికారులు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 26 :** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణం లో కొనసాగుతున్నాయని పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేసినటట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది బందోబస్త్, పెట్రోలింగ్ చేస్తూ పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా,ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని,వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందన్నారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## చరమాంకంలో ఎర్రయుద్ధం...

# లాంగుబాట్లు, ఎదురుకాల్పుల మధ్య క్షీణిస్తున్న మావోయిస్టు ప్రభావం

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9449595494**

భారతదేశంలో సాయుధ వామపక్ష ఉద్యమం చరిత్రను పరిశీలిస్తే అది ఒక్కసారిగా ఉద్భవించిన ప్రక్రియ కాదని, దీర్ఘకాలిక సామాజిక-ఆర్థిక అసమానతల నేపథ్యంలో రూపుదిద్దుకున్న రాజకీయ ప్రతిస్పందన అని స్పష్టమవుతుంది. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో చోటుచేసుకున్న రైతాంగ తిరుగుబాటు ఈ ఉద్యమానికి చిహ్నాత్మక ఆరంభం. భూస్వామ్య దోపిడీ, భూమిలేని కౌలు రైతుల సమస్యలు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం---ఈ మూడు అంశాలు కలిసే అక్కడి సంఘటనలకు దారితీశాయి. "భూమి ఎవరిది? దున్నేవారిదే" అనే నినాదం కేవలం రాజకీయ నినాదం కాకుండా, గ్రామీణ భారతదేశంలో దశాబ్దాలుగా పేరుకు పోయిన అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది. ఆ చిగురుటాకుల చప్పుడు కొద్ది కాలంలోనే అరణ్య ప్రాంతాల గుండా విస్తరించి, సాయుధ సిద్ధాంతపర ఉద్యమంగా మారింది. 1980ల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పీపుల్స్ వార్ గ్రూప్, బీహార్-ఝార్ఖండ్ ప్రాంతాల్లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ వంటి వర్గాలు గెరిల్లా యుద్ధాన్ని ప్రధాన వ్యూహంగా స్వీకరించాయి. గ్రామీణ ప్రాంతాల్లో 'జనతా కోర్టులు', 'లిబరేటెడ్ జోన్లు' వంటి ప్రయోగాలు ప్రారంభ మయ్యాయి. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ విలీనం చెంది సి పి ఐ మావోయిస్ట్‌గా ఏర్పడింది. ఈ విలీనంతో ఉద్యమం ఒకే కేంద్రీకృత నాయకత్వం కిందకి వచ్చింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా





బాధ్యతలు స్వీకరించిన ముప్పాల లక్ష్మణ్‌రావు (గణపతి) సిద్ధాంతపరంగా "దీర్ఘకాల ప్రజాయుద్ధం" మార్గాన్ని బలంగా ముందుకు నడిపించారు. ఆయన నాయకత్వంలో దళాలు దండకారణ్యం, బస్తర్ అరణ్యాలు, ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు, ఆంధ్ర-ఒడిశా బోర్డర్ ప్రాంతాల్లో ప్రభావాన్ని విస్తరించాయి. 2000ల మధ్య నాటికి కేంద్ర హోంశాఖ అంచనాల ప్రకారం దేశంలోని సుమారు 200కు పైగా జిల్లాల్లో మావోయిస్టు ప్రభావం ఉందని పేర్కొన బడింది. 2010 సంవత్సరం ఈ ఉద్యమానికి ఒక కీలక మలుపు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ దాడిలో 76 మంది భద్రతా సిబ్బంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు

2లో



## గోదావరి పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- అన్ని రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 26 :** గోదావరి పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, అన్ని రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురు వారం 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరినదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆర్డీవో మధుసూదన్, డిఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, ఈఈ ఆర్ అండ్ బి, ఈఈ మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లు,ఎంపిడివోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు అధైర్య పడవద్దు..

## ప్రభుత్వం అండగా ఉంటుంది

- పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న బకాయిలు 33 వేల కోట్లు చెల్లించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**చురకలు విలేకరి, రాయికల్, ఫిబ్రవరి 26 :** ప్రకృతి వైపరీత్యంతో అకాల వర్షం,ఈదురు గాలులకు మొక్కజొన్న,మామిడి పంట నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం రాయికల్ మండలం రామజిపేట్ గ్రామంలో ఇటీవల అకాల వర్షం ఈదురు గాలులకు నష్టపోయిన మొక్కజొన్న,మామిడి పంటలను క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలకు 650 ఎకరాలలో పంట నష్టం జరిగిన వెంటనే జిల్లా,మండల స్థాయి వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులతో రైతులతో

2లో

## యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 26 :** యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి అని గుండారం సర్పంచ్ జంగిలిపోచాలు అన్నారు. గుండారం గ్రామపంచాయతీ పరిధిలో క్రీడలను ప్రోత్సహించేందుకు గాను రాజాపూర్ గ్రామంలో వాలీబాల్ క్రీడాకారులకు వాలీబాల్ మరియు నెట్, రెండు ఎల్ఈడి లైట్లు క్రీడాకారులకు తంగినపల్లి నరేష్ తో కలిసి అందించడం జరిగింది. అలాగే గ్రామ ఉపసర్పంచ్ అంబీరి రాజేందర్ వార్డు సభ్యుడు గరిగంటి కృష్ణ సైతం మరొక వాలీబాల్ ను అందజేయడం జరిగింది.నేటి యువత ఫోన్లకే పరిమితం కాకుండా చెడుగలవాట్లకు దూరంగా ఉంటూ గంజాయి మద్యం కు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలని అన్నారు. గ్రామాల్లో యువత క్రీడల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండారం భవాని యూత్ సభ్యులు మరియు రాజాపూర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## నిందితునికి ఏడేళ్ల జైలుశిక్ష, జరిమానా



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 26 :** గంజాయి సాగు, సరఫరా, అమ్మకానికి పాల్పడిన నిందితుడు మెస్రాం నాగనాథ్ నమోదు చేసిన కేసులో గౌరవ న్యాయస్థానం 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు తనకు ఉన్న వ్యవసాయ భూమిలో సోయా మరియు ప్రత్తి పంటలు వేస్తూ జీవనం సాగించేవాడని, అదనపు డబ్బు సంపాదన కోసం ప్రత్తి పంటల మధ్య గంజాయి మొక్కలను రహస్యంగా సాగు చేసినట్లు విచారణలో వెల్లడైంది. గంజాయి మొక్కలను పెంచి, వాటి ఆకులు మరియు కొమ్మలను కోసి ఎండబెట్టి గంజాయిగా తయారు చేసి స్వయంగా వినియోగించడంతో పాటు గంజాయి అలవాటు ఉన్న యువతకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2023 నవంబర్ 7న ఉదయం నిందితుడు తన వద్ద ఉన్న ఎండు గంజాయిని ఒక సంచిలో పెట్టుకొని రాయికల్ పట్టణానికి తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రాయికల్ పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద సుమారు 1.5 కిలోల (1500 గ్రాములు) ఎండు గంజాయి లభ్యమైంది.పంచనామా నిర్వహించి 1500 గ్రాముల ఎండు గంజాయి మరియు ఒక మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై 1 ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ను కోర్టులో దాఖలు చేశారు.ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం గురువారం 7వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్. నారాయణ నిందితుడిని దోషిగా నిర్ధారించి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రూ.10,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల సాగు, సరఫరా, రవాణా మరియు విక్రయం చట్టవిరుద్ధమే కాకుండా సమాజానికి హానికరమని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్ 100 కు తెలియజేయాలని కోరారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి రూరల్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్.ఐ అజయ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. మల్లేశం గౌడ్, సి.ఎం.ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ నరేష్, సి.ఎం.ఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# రైతులు అధైర్య పడవద్దు..ప్రభుత్వం అండగా ఉంటుంది

**మొదటి పేజీ తరువాయి...**

మాట్లాడి పంట నష్ట అంచనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించి రైతులకు నష్ట పరిహారం అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వ్యవసాయ యంత్రాల పంపిణీ లో పంట నష్టపోయిన రైతులకు ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు.దేశంలో ఎక్కడాలేని విధంగా ఏకకాలంలో 21 వేల కోట్ల తో రైతు రుణమాఫీ,రైతు భరోసా అమలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు



ఆకాల వర్షాలకు దెబ్బతినడం చాలా బాధాకరమని పంట నష్ట వివరాలను ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ నివేదిక అందించారని పేర్కొన్నారు.అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న బకాయిలు 33 వేల కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆర్థిక లోటు ఉన్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమల్లో ఎక్కడ జాప్యం కాలేదన్నారు.కౌలు రైతులు,రైతు కూలీల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అండగా ఉంటుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి మోహన్,మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రావు,మండల నాయకులు కోల శ్రీనివాస్,ఏనుగు మల్లారెడ్డి,సురేందర్ నాయక్,ఉప సర్పంచ్ సుధీర్,వార్డు సభ్యులు నారా యణ,భరత్ రెడ్డి,విజయ్,నర్సా రెడ్డి, నాయకులు బేతి మోహన్ రెడ్డి, భీతి మల్లారెడ్డి,వ్యవసాయ అధికారి ముక్తేశ్వర్ ,అధికారులు ,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# చరమాంకంలో ఎర్రయుద్ధం...

**మొదటి పేజీ తరువాయి...**

హింసను "అంతర్గత భద్రతకు అతిపెద్ద ముప్పు"గా అధికారికంగా పేర్కొంది. ఇదే సమయంలో సమగ్ర భద్రతా వ్యూహానికి రూపకల్పన జరిగింది. రాష్ట్ర పోలీసు బలగాలు, సి ఆర్ పి ఎఫ్, కోబ్రా కమాండోలు, ప్రత్యేక దళాలు సంయుక్తంగా అరణ్య ప్రాంతాల్లో విస్తృత ఆపరేషన్లు ప్రారంభించాయి. మీడియా వర్గాల్లో "ఆపరేషన్ గ్రీన్ హంట్"గా ప్రాచుర్యం పొందిన చర్యల తరువాత మరింత లక్ష్య సాధనతో సాగిన సమన్వ య ఆపరేషన్లు కొన్ని ప్రాంతాల్లో "ఆపరేషన్ కగార్" పేరుతో కొనసాగాయి.ఈ ఆపరేషన్ల ప్రధాన లక్ష్యం గెరిల్లా దళాల సరఫరా మార్గాల ను తెగదెంపులు చేయడం, అరణ్యాల్లో వారి కదలికలను పరిమితం చేయడం, ఇంటెలిజెన్స్ నెట్వర్క్‌ను బలోపేతం చేయడం.డ్రోన్ పర్యవేక్షణ,శాటిలైట్ కమ్యూనికేషన్,ఆధునిక ఆయుధ సదుపాయాలు భద్రతా బలగాలకు సాంకేతిక ఆధిక్యతను ఇచ్చాయి. ఫలితంగా 2010లో నమోదైన సుమారు 2,000కు పైగా హింసాత్మక ఘటనలు 2022--23నాటికి 500కు లోపుగా తగ్గినట్లు కేంద్ర గణాంకాలు సూచించాయి.మరణాల సంఖ్య కూడా గణనీయంగా పడిపోయింది.ఇది కేవలం సైనిక విజయమే కాకుండా ఉద్యమ నిర్మాణంలో ఏర్పడిన చీలికల సంకేతం. లొంగుబాట్లు ఉద్యమ క్షీణతలో కీలక పాత్ర పోషించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పునరావాస ప్యాకేజీలు, ఆర్థిక సహాయం, గృహ స్థలాలు, ఉపాధి శిక్షణలు కేడర్లను ఆకర్షించాయి. మధ్యస్థాయి నాయకులు,ఏరియా కమిటీ సభ్యులు కూడా లొంగిపోవడం వల్ల సంఘటిత నిర్మాణం దెబ్బతిన్నది. ఒకప్పుడు అడవుల్లో గెరిల్లా యుద్ధాన్ని నడిపిన నాయకులు ప్రజా ప్రధాన ప్రవాహంలోకి రావడం ఉద్యమానికి మానసిక దెబ్బ.లొంగు బాటు చేసిన పలువురు తమ అనుభ వాలను బహిర్గతం చేయడంతో అంతర్గత విభేదాలు, కఠిన నియమాలు, జీవన కష్టాలు వెలుగులోకి వచ్చాయి. ఎదురుకాల్పులు కూడా పెరిగాయి. బస్తర్, సుక్మా, బీజాపూర్ ప్రాంతాల్లో జరిగిన సంయుక్త ఆపరేషన్లలో పలువురు కీలక నాయకులు మృతి చెందారు. అడవుల్లో సురక్షిత ఆశ్రయాల కొరత, స్థానిక మద్దతు తగ్గుదల, ఆర్థిక వనరుల లోపం---ఇవన్నీ కలిసి గెరిల్లా వ్యూహాన్ని బలహీన పరిచాయి. ఒకప్పుడు "రెడ్ కారిడార్"గా పేర్కొనబడిన విస్తీర్ణం ఇప్పుడు భౌగోళికంగా సంకుచితమైంది. కేంద్ర హోంశాఖ ప్రకటనల ప్రకారం ప్రభావిత జిల్లాల సంఖ్య 90కు లోపుగా తగ్గింది. ఈ పరిణామాల్లో గణపతి పాత్ర విశ్లేషణీయ అంశం.2004 నుంచి దాదాపు పదిహేనేళ్లకు పైగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన ఆయన సిద్ధాంతపర దిశానిర్దేశం ఉద్యమాన్ని సమన్వయ పరిచింది.అయితే వయసు, ఆరోగ్య సమస్యలు,భద్రతా ఒత్తిడి కారణంగా 2018 తర్వాత ఆయన క్రియాశీలక పాత్ర తగ్గిందని అధికార వర్గాలు సూచించాయి. నాయకత్వ మార్పు, అంతర్గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలు సాగినట్లు సమాచారం. గణపతి ప్రజా దృష్టికి దూరమవడం ఉద్యమానికి ఒక ప్రతీకాత్మక మలుపు. ఒక యుగం ముగింపు భావన కేడర్లలో కూడా స్పష్టమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే ఉద్యమం పూర్తిగా అంతరించి పోయిందని చెప్పడం తొందరపాటు. సామాజిక అసమానతలు,భూహక్కుల వివాదాలు,గనుల అనుమతులపై స్థానిక ప్రజల ఆందోళనలు,ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి లోపాలు ఇంకా పూర్తిగా పరిష్కార మవ్వలేదు. అరణ్య హక్కుల చట్ట అమలు, మౌలిక సదుపాయాల విస్తరణ,విద్య-ఆరోగ్య సేవల మెరుగుదల వంటి చర్యలు కొంతమేర ప్రభావం చూపుతున్నప్పటికీ, అసంతృప్తి విత్తనాలు పూర్తిగా నశించలేదు. సాయుధ పోరాటం బలహీన పడినా భావజాలం మౌనంగా కొనసాగవచ్చని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం ఒక చరమాంక దశలా అనిపిస్తోంది. గెరిల్లా దళాల సంఖ్య తగ్గింది; నాయకత్వం శూన్యంగా మారింది; లొంగుబాట్లు పెరిగాయి; ఎదురుకాల్పుల్లో నష్టం అధికమైంది; భద్రతా బలగాల ఆధిక్యం పెరిగింది. గణపతి యుగం ముగింపు దశలోకి వెళ్లగా ఉద్యమం కూడా సంక్షోభ దశను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిన ఎర్రచరిత్ర ఇప్పుడు కొన్ని అరణ్య ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది.అంతిమంగా ఈ పరిణామం భారత ప్రజాస్వామ్యానికి ఒక పాఠం. సాయుధ ఉద్యమం క్షీణత భద్రతా విజయమే అయినప్పటికీ, దీర్ఘకాలిక శాంతి కోసం అభివృద్ధి, సామాజిక న్యాయం, రాజకీయ సంభాషణ సమానంగా అవసరం. నక్సల్బారి నుంచి దండకారణ్యం వరకు సాగిన ఈ ప్రయాణం ఒక యుగాన్ని నిర్వచించింది. ఇప్పుడు ఆ యుగం చరమాంకంలోకి చేరినట్టు కనిపిస్తున్నా, దాని మూల కారణాలపై సమగ్ర పరిష్కారం కనుగొనడమే స్థిరశాంతికి మార్గం.

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న

# హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని

చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 26 : రంజాన్ మాసం సందర్భంగా ఇస్లాంపురలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, మాజీ మున్సిపల్ చైర్మన్ వద్లూరి విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ రంజాన్ మాసం ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని అన్నారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, ముస్లింలు నెల



రోజులపాటు అత్యంత కఠిన నియమాలతో అల్లాను ప్రార్థిస్తారని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు. హుజురాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ వద్లూరి విజయకుమార్ మాట్లాడుతూ మతాలకతీతంగా ఇఫ్తార్ విందులో పాల్గొనడం సోదర భావాన్ని పెంచి లౌకిక విలువలను కాపాడతాయని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ను మైనారిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ ఇఫ్తార్ విందులో జామే మస్జిద్ ఈద్గా ఖబ్రస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, మక్కా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీమ్, మాజీ అధ్యక్షుడు ఖాజా బద్రోద్దీన్ (బదర్ భాయ్), ఇమామ్ సోహెల్, ముస్లిం నాయకులు సయ్యద్ సలీం, మహమ్మద్ బాషుమియా, సయ్యద్ అబ్దుల్లా, సయ్యద్ సర్వర్, మహమ్మద్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగాన్ని త్యజించి ధర్మప్రచారానికి అంకితమైన జీవితం

## -సహస్ర భాగవత సప్తాహాల సారథి పరాంకుశాచార్యులు

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



జగిత్యాల జిల్లాకు ఆధ్యాత్మిక కాంతి పుంజంగా నిలిచిన మందపల్లి పరాంకుశాచార్య స్వామి (పాపాచార్యులు) శతాధిక వయస్సులో పరమపదించిన వార్త భక్తజన సమాజాన్ని విషాదంలో ముంచెత్తింది.వంద మూడేళ్ల దీర్ఘాయుష్షును అనుభవించి,చివరి శ్వాస వరకు సాంప్రదాయ ధర్మ ప్రచారాన్ని జీవిత ధ్యేయంగా నిలబెట్టుకున్న ఈ మహనీయుని జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయక గాథగా నిలిచి పోతుంది. లక్షెట్టిపేట వాస్తవ్యులైన ఆయన దాదాపు ఎనభై అయిదేళ్లకు పైగా గ్రామంలోని జగన్నాథాచార్యుల ఆలయంలో వంశపారంపర్య అర్చకుడిగా సేవలందించి,ఆలయ పరంపరను కాపాడిన కర్తవ్య నిరతుడిగా ఖ్యాతి గడించారు.వేయికి పైగా భాగవత సప్తాహాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి ,పౌరాణిక ధర్మ ప్రచారంలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. ప్రమోదూత నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ చతుర్దశి నాడు 1929లో జగిత్యాల జిల్లాలో జన్మించిన పరాంకుశాచార్యుల తల్లి రాధమ్మ, తండ్రి మందపల్లి రామాచార్యులు. తండ్రి రెవిన్యూ శాఖలో ఉద్యోగిగా ఉన్నప్పటికీ సంప్రదాయ నిష్ఠను కాపాడిన వారు. తాతగారు మందపల్లి పాపయ్య తహసీల్దారు హోదాలో ఉన్నప్పటికీ ధర్మాచరణలో ఆదర్శంగా నిలిచారు. మాతామహులు నంబి సీతారామాచార్యులు సాంప్రదాయ పాండిత్య సంపత్తితో ప్రసిద్ధి గాంచారు. ఈ విధంగా కుటుంబ వాతావరణమే పరాంకుశాచార్యుల వారిలో ధర్మనిష్ఠను, వేదాంతాసక్తిని పెంపొందించింది. బాల్యంలోనే అసాధారణ మేధస్సుతో అమర కోశాన్ని కంఠస్థం చేయడం ఆయన విద్యా ప్రస్థానానికి బలమైన పునాది.కోరుట్లలోని సేనాపతి సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించి, తొలి శతావధాని శిరీశిహల్ కృష్ణమాచార్యుల వద్ద రామశబ్దం నుండి శ్రీభాష్యాంతం వరకు సంస్కృత సాహిత్యాన్ని, ఉభయ వేదాంత గ్రంథాలను అధీతి చేశారు.గురుపరంపరపై ఉన్న భక్తి, శాస్త్రాధ్యయనంలో ఉన్న శ్రద్ధ ఆయనను ప్రగాఢ పాండిత్యంతో తీర్చిదిద్దాయి.కేవలం పాఠ్యాంశ పరిధి లోనే కాకుండా పురాణ, ఇతిహాస, ఆళ్వారు ప్రబంధాలపై కూడా సమగ్ర పట్టు సాధించారు. చిన్ననాటి నుంచే హిందీ విద్యను అభ్యసించి 1945లో హిందీవిద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణుల య్యారు.అయితే తండ్రి ఆజ్ఞానుసారం ఉద్యోగ జీవితం వైపు మళ్లక, సంప్రదాయ ధర్మ ప్రచారాన్ని జీవన వ్రతంగా స్వీకరించారు.ఈ నిర్ణయం ఆయన జీవితాన్ని సాధారణ గృహస్థుని స్థాయి నుండి ఆధ్యాత్మిక గురువుగా ఎదగడానికి మార్గం చూపింది. పంచ సంస్కార గురువుగా కోరుట్లకు చెందిన శ్రీ ఉ.వే.ప్ర. రాజయోగి సేనాపతి నృసింహాచార్యుల వారి సన్నిధిలో సంస్కార దీక్ష పొందడం ఆయన జీవితంలో కీలక ఘట్టం.మోర్తాడుకు చెందిన లక్ష్మమ్మతో పన్నెండేళ్ల వయసులోనే వివాహం జరిగినప్పటికీ గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటిస్తూ, ఆధ్యాత్మిక సేవను సమన్వయ పరిచారు. కుటుంబంగా ఇద్దరు కుమారులు---శ్రీ రామమూర్తి, జగన్నాథాచార్యులు... ఇద్దరు కుమార్తెలు ఆండాళు, పద్మ. పెద్ద కుమారుడు రామమూర్తి ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగం చేసి విరమణ పొందారు. వయోభారంతో చివరి కాలంలో హైదరాబాద్‌లో కుమారుడి వద్ద నివసించినప్పటికీ, ధర్మ చింతన, జప తపాలు, పఠన ప్రవచనాలు ఆయన దినచర్యలో అంతర్భాగంగా ఉండేవి. పరాంకుశాచార్యుల వారి ఖ్యాతికి మూలకారణం ఆయన నిర్వహించిన భాగవత సప్తాహాలే.రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో భాగవత సప్తాహాలు నిర్వహించి భక్తులను భగవద్భక్తి మార్గంలో నడిపించారు.

శ్రీమద్రామాయణం, మహాభారతం వంటి మహా గ్రంథాలపై సుమారు ఇరవై సార్లు కాలక్షేపాలు నిర్వహించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. తిరుమంత్రార్థం,తిరుప్పావు, శ్రీవచన భూషణం వంటి విశిష్టాద్వైత సాంప్రదాయ గ్రంథాలపై ప్రవచనాలు చేసి ఉభయ వేదాంత పాండిత్యాన్ని ప్రతిభావంతంగా చాటారు.ఆయన శ్రావ్యకంఠం,సులభ వ్యాఖ్యాన శైలి, ఉదాహరణలతో కూడిన వివరణ ప్రజలను ఆకట్టుకునేవి.భక్తి నివేదనలో భాగంగా శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామివారి మంగళా శాసనాలు అందుకోవడం ఆయన ఆధ్యాత్మిక సేవకు లభించిన విశిష్ట గౌరవం.రాష్ట్రీయ సంస్కృత సంస్థానం లోనూ ఆయనకు ఉభయ వేదాంత పండిత భృతి లభించడం ఆయన పాండిత్యానికి గుర్తింపు. సుమారు ముప్పై ఆరు సంవత్సరాలు ప్రతి వత్సరం ఆర్థిక సాయం అందుకోవడం ఆయన శాస్త్ర సేవకు ప్రభుత్వ స్థాయి మన్ననగా నిలిచింది. లక్షెట్టిపేటలో నలభై ఏళ్లకుపైగా నివసించి ఆ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా నిలిచారు. జగిత్యాల,కరీంనగర్,నిజామాబాద్ ప్రాంతాల్లో ఆయన పేరు భాగవత పండితునిగా మార్మోగేది.ధనుర్మాసంలో తిరుప్పావు కాలక్షేపాలు నిర్వహించడం, వేణుగోపాల స్వామి సన్నిధిలో దివ్యప్రబంధ పఠనం చేయడం ఆయన దినచర్యలో భాగం.తి.తి.దే. ఆధ్వర్యం లోని ఆళ్వారు ప్రబంధ ప్రాజెక్టులో పాల్గొని దివ్యప్రబంధాల ప్రచారం చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనం.అనారోగ్యానికి లోనుకాకుండా దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితం గడపడం ఆయన నియమ నిష్ఠలకు ప్రతిఫలం. వయోభారంతో స్వల్ప అస్వస్థత ఏర్పడటంతో ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేక పరమ పదించారు.స్వగ్రామంలోనే అంత్య క్రియలు జరగాలన్న ఆయన కోరిక మేరకు లక్షెట్టిపేట గోదావరి తీరాన సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.బంధువులు, శిష్యులు, ధర్మపురి పండితులు,స్థానిక బ్రాహ్మణులు , గ్రామస్తులు అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి నివాళులు అర్పించారు .పరాంకుశాచార్యుల జీవితం ఒక వ్యక్తి సాధన ఎంత దూరం తీసుకెళ్లగలదో చూపిన సజీవ సాక్ష్యం.ఉద్యోగావకాశాలను త్యజించి సంప్రదాయ ప్రచారాన్ని ఎంచుకోవడం,కుటుంబ బాధ్యతల మధ్య ధర్మసేవను సమన్వయ పరచడం, శాస్త్ర పాండిత్యాన్ని ప్రజలందరికీ అందుబాటులో ఉంచడం---ఇవి అన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని విశిష్టంగా నిలబెట్టాయి.భాగవత సప్తాహాల ద్వారా భక్తుల్లో నైతిక విలువలను, భగవద్భక్తిని, సత్సంస్కారాలను నాటిన ఆచార్యుల వారు కేవలం ప్రవచనకర్త మాత్రమే కాదు; జీవనోపాధ్యాయుడు.ఆయన కంఠస్థ జ్ఞానం, ప్రవచన నైపుణ్యం, గురుపరంపరపై భక్తి, శిష్యులపై ప్రేమ--- కలసి ఒక సంపూర్ణ ఆచార్య స్వరూపాన్ని నిర్మించాయి. సమాజంలో మారుతున్న విలువల మధ్య సంప్రదాయాన్ని కాపాడే ధృఢచిత్తంతో జీవించిన ఆయన, ఆచార్య పరంపరలో అరుదైన రత్నంగా నిలిచారు. శతాధిక వయస్సు దాటినా ధర్మప్రచారం ఆపకుండా కొనసాగించడం ఆయన ఆత్మబలాన్ని తెలియ జేస్తుంది.నేటి తరానికి పరాంకుశాచార్యుల వారి జీవితం ఒక సందేశం---సంస్కృత విద్య, వేదాంత పాండిత్యం, సంప్రదాయ నిష్ఠలు కేవలం గతకాలపు ఆస్తులు కావు; అవి సమాజాన్ని సుస్థిరంగా నిలబెట్టే మూల స్తంభాలు. గ్రామీణ వాతావరణంలో జన్మించి రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి గడించిన ఆయన సాధన స్ఫూర్తిదాయకం. శాస్త్రసేవ, భక్తిప్రచారం, గురుభక్తి, నియమనిష్ఠలు కలిసి ఒక మహనీయుని నిర్మిస్తాయని ఆయన జీవితం స్పష్టం చేస్తుంది.మందపల్లి పరాంకుశాచార్యస్వామి వారి పరమపదం ఒక యుగాంతరంలా అనిపించినా, ఆయన బోధనలు, ప్రవచనాలు, శిష్యపరంపర రూపంలో ఆధ్యాత్మిక వారసత్వం కొనసాగుతూనే ఉంటుంది. లక్షెట్టిపేట గోదావరి తీరంలో ఆయనకు నిర్వహించిన అంత్యక్రియలు కేవలం ఒక మహనీయునికి వీడ్కోలు మాత్రమే కాదు; ఒక సంప్రదాయ యుగానికి గౌరవనివాళి. ఆయన జీవితం భక్తి, పాండిత్యం, సేవ అనే త్రివేణి సంగమంగా నిలిచి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

# రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఫిబ్రవరి 26 :** రాష్ట్ర స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ ఖో-ఖో పోటీల్లో జగిత్యాల జిల్లా జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో కీలక పాత్ర పోషించిన మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా విద్యాధికారి కె. రాము ప్రత్యేకంగా అభినందించారు.వెల్లుల్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు నవీన్,అభిలాష్, మిథున్ రాజ్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తెచ్చారు. తన కార్యాలయంలో విద్యార్థులను సన్మానించిన డీఈఓ, వీరు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కొమురయ్యలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో రాణించడం వల్ల క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి.వెల్లుల్ల విద్యార్థుల విజయం జిల్లా



లోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంకావాలని జిల్లా విద్యాధికారికె. రాము అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్, పెటా అధ్యక్షులు విశ్వప్రసాద్,కృష్ణ ప్రసాద్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# మృతుని కుటుంబానికి పరామర్శ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 26 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం శ్రీ రామ భక్త ఆంజనేయ స్వామి ఆలయ అర్చకులు వకుళాభరణం నరసింహస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసి చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. మృతుని చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. మృతి సంఘటన వివరాలు తెలుసుకొని అర్చక వెల్ఫేర్ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం త్వరగా అందేలా చూస్తానని మృతుని కుమారులు వకుళా భరణం సత్యం,వెంకటేష్‌లకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యులు జక్కాపురం నారాయణ స్వామి, పెద్దపల్లి జిల్లా డిడిఎన్ అర్చక సంఘ ఉపాధ్యక్షులు,బండవరం నరసింహమూర్తి,ధర్మారం మండల ఉపాధ్యక్షులు ఎర్రమరాజు రామకృష్ణరాజు,వెల్గటూర్ మండల ఉపసర్పంచ్ లఫోరంఅధ్యక్షుడు గండ్రప్రతాప్ రావు,స్తంభంపల్లి గ్రామ ఉప సర్పంచ్ యాగండ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇబ్బందులు లేకుండా నిధుల మంజూరు



**చురకలు విలేకరి, ధర్మపురి, ఫిబ్రవరి 26 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం దశల వారీగా నిధులను మంజూరు చేస్తుందని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గజ్జి బుజ్జమ్మ కి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కాగా అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు త్వరితగతిన నిర్మాణం పూర్తి కి మున్సిపల్ నుండి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చైర్ పర్సన్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ చుక్క సంధ్య- భీమరాజ్, వార్డు ఆఫీసర్ అనిల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, హౌసింగ్ ఏఈ మధుశ్రీ,లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సును ఢీకొట్టి వ్యక్తి మృతి




**చురకలు విలేకరి, రాయికల్, ఫిబ్రవరి 26 :** రాయికల్ మండలం రామోజీపేటలో గురువారం స్కూల్ బస్సును ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రాయల్ ఎన్ఫీల్డ్ బైక్పై వెళ్తున్న కొల్లూరి మధు అనే వ్యక్తి రోడ్డుపై ఆగి ఉన్న స్కూల్ బస్సును ముందు నుండి ఢీ కొట్టాడు. బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న మధు తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అతివేగమే ప్రమాదానికీ కారణం అని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. మృతుడు మల్లాపూర్ మండలం గుండంపెల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

# కోటిలింగాలలో గోదావరి పుష్కరాలు ఘనంగా జరుపాలి

**-రాష్ట్ర అర్చక ఉద్యోగ జెఏసి చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 26 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల లో రానున్న గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహించడానికి ఇప్పటి నుండే అభివృద్ధి పనుల ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర అర్చక జెఏసి చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ప్రభుత్వ సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులను కోరారు. గురువారం కోటిలింగాలను సందర్శించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.ఇక్కడి గోదావరి తీరంలోని కోటేశ్వర స్వామి ఆలయం అతి ప్రాచీనమైనదని,చారిత్రకత సంచరించుకుందని,రాష్ట్ర నలుమూలాల నుండి భక్తులు నిత్యం వస్తుంటారని, ఇలాంటి ప్రదేశంలో జరిగే పుష్కరాలకు లక్షల సంఖ్యల్లో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్ల కోసం భారీగా నిధులు సమకూ ర్చాలని ముఖ్యంగా పిండప్రదా నాల కోసం భారీ షెడ్డులు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కోటిలింగాల గోదావరి పుష్కరాల్లో పూజలకు అవసర మైతే అదనపు అర్చకులను నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యులు జక్కాపురం నారాయణ స్వామి, నరసింహా మూర్తి,రామకృష్ణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్ట్ పేరుతో ఘరానా మోసం

**-దేవుడు వస్తాడు.... దయ్యం పోతుందంటూ బురిడీ బాబా చిలిపి వేషాలు**

**-నకిలీ బాబాపై చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు**



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, ఫిబ్రవరి 26 :** మెట్‌పల్లి డివిజన్ పరిధిలో అమాయక ప్రజల నమ్మకమే పెట్టుబడిగా, భక్తి ముసుగులో ఒక కేటుగాడు బురిడీ బాబా వేషంలో సాగిస్తున్న ఘరానా మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.దేవుడు వస్తాడు.. దయ్యం వదులుతుంది అంటూ తప్పుడు ప్రచారంతో ఇబ్రహీంపట్నం మండలం లోని బర్ధిపూర్ గ్రామంలో ఒక భూత వైద్యుడు అరాచకాలకు తెరలేపాడు.ఒక స్వచ్ఛంద సంస్థ (ట్రస్ట్) పేరును అడ్డం పెట్టుకుని లక్షల రూపాయలు దండుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడు.

**ఆ గ్రామంలో అసలేం జరుగుతోంది.?**

గత కొంతకాలంగా బర్ధిపూర్ గ్రామంలో ఒక వ్యక్తి ట్రస్ట్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు.తన వద్దకు వస్తే ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులైనా నయమవుతాయని,ఒంట్లో ఉన్న భూతంలాంటి దయ్యాలను కూడా వెళ్లగొడతానని ప్రచారం చేసుకుంటు న్నాడు.

**మాయ మాటల గారడీ బాబా..**

మానసిక సమస్యలు లేదా అనా రోగ్యంతో ఉన్నవారిని టార్గెట్ చేసి, వారికి దయ్యం పట్టిందని నమ్మిసు న్నాడు.ప్రతి శుక్రవారం అదే గ్రామం లోని ఒక గుట్టపై పూజల పేరుతో, తాయెత్తుల పేరుతో బాధితుల నుండి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం.చట్టం నుండి తప్పించు కోవడానికి ఒక ట్రస్ట్ పేరును వాడుకుంటూ,ఇది కేవలం సేవ మాత్రమేనని ప్రజలను నమ్మిస్తూ తెరవెనుక భారీగా తయాత్తు దందాను నడిపిస్తున్నాడని విశ్వసనీయత సమాచారం.అమాయక ప్రజలే లక్ష్యం చదువుకోని వారు,గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలే ఈ భూత వైద్యుడి ప్రధాన బాధితులు. ఒకసారి అయన గారి ఇలాకాలోకి వెళితే ఆస్పత్రులకు వెళ్లాల్సిన వారు సైతం ఈయన మాటలు నమ్మి విలువైన ప్రాణాలను, సమయాన్ని,డబ్బును వృథా చేసుకుంటున్నారు.కొన్ని సందర్భాల్లో అనారోగ్యం పాలైన వారు సరైన వైద్యం అందక పరిస్థితి విషమిస్తున్నా, ఇదంతా దేవుడి మహిమఅంటూ నమ్మబలుకు తున్నాడని గ్రామస్థులు వాపోతున్నారు. దేవుడి పేరుతో సాగుతున్న ఈ అరాచకాన్ని చూసి స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.భక్తి పేరుతో జరుగుతున్న ఈ అనాచారాల వల్ల గ్రామంలోని ప్రశాంతత దెబ్బతింటోం దని, భర్తీపూర్ కేంద్రంగా సాగుతున్న ఈ బురిడీ బాబా అరాచకాలపై స్థానికుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవు తోంది. బాబా చేసే వింత చేష్టలు, నమ్మబలికే మాయ మాటల వెనుక భారీ మోసాలే = ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. అయితే, ఇవి కొత్తగా మొదలైనవి కావని, గతంలోనే బాబా లీలలపై కొందరు బాధితులు పోలీసుల కు ఫిర్యాదు చేశారని విశ్వసనీయ సమాచారం.అప్పట్లోనే బాబా ఆగడాలకు అడ్డుకట్ట వేసి ఉంటే, మరి కొంతమంది నిరు పేదలు అప్పుల పాలు కాకుండా ఆయన చేతిలో మోసపోకుండా ఉండేవారని గ్రామస్థులు అభిప్రాయపడు తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ నకిలీ బాబాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# డిజిటల్ హెల్త్ కార్డుల పై అపోహాలు వద్దు

**-ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగళి శ్రీపాల్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 26 :**

ప్రభుత్వం జారీ చేయబోయే డిజిటల్ హెల్త్ కార్డులపై అపోహాలు వద్దని ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఓల్డ్ హైస్కూల్లో పని చేస్తూ ఈనెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న రాళ్ల బండి సావిత్రి మోహన్ రెడ్డిస్కూల్ అసిస్టెంట్ (సోషల్)సన్మాన మహోత్స వానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ హెల్త్ కార్డుల నిర్వహణ ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిర్వహణ ఉంటుందని వారన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయులకు,పెన్షనర్స్ కు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ ఈ స్కీము అన్లిమిటెడ్‌గా వర్తిస్తుందని వారన్నారు. అదే విధంగా సర్వీసు రూల్స్‌కు త్వరలోనే పరిష్కారం లభించి పదోన్నతులు వస్తాయని వారన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం శాసనమండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వారన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిఆర్‌టియుటి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్సి సాధన కోసం త్వరలోనే ఉద్యమిస్తామని అన్నారు. పి ఆర్‌టియు టిఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రభుత్వంపై పోరాడుతామని వారన్నారు.జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమే, సేవకు కాదు అని ఉద్యోగ విరమణ అనంతరం సేవ చేయాలని వారు అన్నారు అనంతరం సావిత్రి సేవలను కొనియాడి,సావిత్రి ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్‌రావు,యాల్ల అమర్నాథ్ రెడ్డి,పీఆర్‌టియు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి,అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ సుజాత,జిటిఏ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

## జిల్లాలో రెండవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 26 :** జగిత్యాల జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలను గురువారం 30 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. జనరల్ కోర్సులకు సంబంధించి 5832 మరియు ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 801 హాజరు కాగా 133 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 98.3 శాతం విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కోరుట్లలోని పిఆర్బిఎం కళాశాలలో, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరీక్ష కేంద్రాల్లో కల్పించిన ఏర్పాట్లను పరిశీలిం చారు.జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని,విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి కి లోనైనా కూడా టెలి మానస్ సహాయ కేంద్రం నెంబర్ 14416.కి ఫోన్‌చేసి సహాయం పొందవచ్చని జిల్లా పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు.

## గొడిశెలపేటలో అరైవ్, అలైవ్ పోలీసుల అవగాహన



**చురకలు, విలేఖరి,వెల్గటూర్, ఫిబ్రవరి 26 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడిశెలపేట గ్రామంలో గురువారం ఎస్సై ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు,రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమంలో వాహన దారులు,ఆటో డ్రైవర్లు,ద్విచక్ర వాహన దారులు, ప్రజలు తప్పకుం డా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని,ముఖ్యంగా హెల్మెట్ తప్పనిసరి ధరించడం,మద్యం సేవించి వాహనం నడప కూడదు,వేగ పరిమితులను పాటించడం,సీటు బెల్ట్ వినియోగం,మొబైల్ ఫోన్ వాడకాన్ని నివారించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశం,పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటినుండే నాగపెల్లి నారసింహుడి బ్రహ్మోత్సవాలు

**-భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 26 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట గ్రామ శివారు గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయంలో నేటి నుండి 5 రోజులపాటుజరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గుట్టపై నున్న ఆలయానికి రంగులద్ది, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.ఆలయ పరిసరా ల్లోశానిటేషన్, మంచినీటి సౌఖర్యం, పార్కింగ్,రాకపోకలకుఅంతరాయం కలుగకుండా రహదారి ఏర్పాటు, కళ్యాణ మండపం, ప్రత్యేక పూజలు , గిరిప్రదక్షణ రోడ్డు సౌఖర్యంతోపాటు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, గ్రామ సర్పంచ్, ధర్మక ర్తలు తెలిపారు.శు క్రవారం ఉదయం ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా సాయంత్రం స్వామి వారి కళ్యాణం జరుగనుందని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని, బ్రహ్మోత్సవాల విజయవంతం కోసం ప్రతిఒక్కరు తమవంతు సహకారం అందించాలని కోరారు.

# అవినీతి రహిత పాలన అందిస్తాం

**-అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి**
**-మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (మంథని), ఫిబ్రవరి 26 :** మంథని మునిసిపల్ లో అవినీతి రహిత పాలనను అందిస్తామని..మంథని అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలని మునిసిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి లు అన్నారు.గురువారం మంథని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డిలను జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. సమాజంలో జర్నలిస్టులు ఎంతో కీలకమైన వ్యక్తులని ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగిన వారికే ముందుగా తెలుస్తుందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి జర్నలిస్టులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్టులు పట్టణంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపికలో అర్హులను గుర్తించేందుకు సహకరించాలన్నారు. జర్నలిస్టుల సహకారం తో మంథని పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం జర్నలిస్టులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్, ఉపాధ్యక్షులు బర్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం ఆంజనేయులు, కోశాధికారి తగరం రాజు, సీనియర్ జర్నలిస్టులు కొమురోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, అంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, ఆర్ల బాపు, పెండ్యాల రాంకుమార్, లక్కాకుల నాగరాజు, బాసాని సాగర్, ఒజ్జల శ్రీనివాస్, లింగాల సురేష్, దొరగొర్ల రవీందర్, కేసారపు రవి, బండారి సమ్మయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.



## కరీంనగర్ కార్పొరేటర్‌కు రత్నాపూర్‌లో సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 26 :** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో బుధవారం కరీంనగర్ కార్పొరేటర్ తాటి ప్రభావతి-మనోహర్ ని ఘనంగా సన్మానించారు. రత్నాపూర్ స్వస్థలం కు చెందిన ప్రభావతి రెండో సారి కరీంనగర్-56వ డివిజన్ నుండి గెలుపొందిశీది. రత్నాపూర్ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రభావతికి ఘన సన్మానం చేసారు. శాల్వాలు కప్పి,పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్, స్థానిక నాయకులు కొండు అంజన్న,కొండు. లక్ష్మణ్,కొప్పుల రవీందర్ రావు,కొండు.లక్ష్మీ, పల్లె అమర,బొంగురాల రవి, సందెవేన కుమార్,బోగే సతీష్,ఖండే కిష్టయ్య, బర్ల వెంకన్న, ఇజ్జగిరి సంపత్,గుండా రాదయ్య,పానుగంటి ప్రశాంత్,కాపర్తి వెంకటేష్, పబ్బా సది, సింగరపు నగేష్,దాసరి మల్లన్న,గూడెపు లక్ష్మారెడ్డి, గుమ్మనూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రజత పతకం సాధించిన జయ సాయిచరణ్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 26 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం,కప్,పోటీలో టింగు జయ సాయి చరణ్, రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించారు, గోదావరిఖని పట్టణానికి చెందిన టింగు జయ సాయి చరణ్ అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్నాడు, డ్రాగన్ షాటోకాన్ కరాటే క్లబ్ మాస్టర్ పసునూటి చందు వద్ద కరాటే లో,శిక్షణ తీసుకుంటున్నాడు, హైదరాబాదులోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో 33 జిల్లాల నుండి 15 సంవత్సరాల విభాగం, 52 వెయిట్ క్యాటగిరిలో రాష్ట్ర స్థాయిలో సీఎం కప్, పోటీలలో, రజిత పతకాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రంలో మూడో స్థానంలో గెలుపొంది రాష్ట్రస్థాయి లో పేరు నిలబెట్టారు, కరాటే పోటీలలో అనేక అవార్డులు గోల్డ్ మెడలు సాధించిన టింగు జయ సాయి చరణ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటీలలో రాష్ట్రస్థాయిలో రజత పతకం తెలు పొందడం పట్ల, కరాటే మాస్టర్లు పసునూటి చందు, సుంకే రాజు, శ్రీనివాస్, లు పూలమాలవేసి అభినందించారు.

# మార్చి 28న తారా ఆర్ట్స్ అకాడమీ అవార్డులు




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) ఫిబ్రవరి 26 :** మార్చి 28 ,29 తేదీల్లో తార ఆర్ట్స్ అకాడమీ వారు అవార్డులను అర్హులైన వారికి పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్ అంటారు.తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖనిలో రెండు రోజులపాటు జాతీయస్థాయి నృత్య పోటీలు, ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డ్స్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, ఇప్టా జాతీయ సమితి నాయకులు కే.స్వామి తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తారా ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఉత్తరాఖండ్, తమిళనాడు,అండమాన్ నికోబార్, అమెరికా,మలేషియా,సింగపూర్, స్విట్జర్లాండ్,తైవాన్ తదితర దేశాలలో సైతం కళోత్సవాలు నిర్వహించి,వివిధ రంగాలలో లబ్ద ప్రతిష్టులైన వారిని సముచిత రీతిన సత్కరించడం జరిగిందన్నారు.గోదావరిఖని కేంద్రంగా 2021లో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలు, ఆజాదీకా అమృత్‌మహోత్సవ్, 2024లో విభిన్న రంగాలలో రాణిస్తున్న సుమారు 125 మంది సింగరేణి ఉద్యోగులు,వారి కుటుంబాల పిల్లలను గుర్తించి,నల్ల వజ్రం జాతీయ పురస్కారాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖని ఆర్కే గార్డెన్స్ లో ఉగాది ఉత్సవాలు, జాతీయస్థాయి జానపద, శాస్త్రీయ బృంద నృత్యాల పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విజేతలకునగదు బహుమతితో పాటు జ్ఞాపికలు,సర్టిఫికెట్లతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.అలాగే విద్య, వైద్యం,పాత్రికేయ,న్యాయవాద, ఉపాధ్యాయ,ఉద్యోగులు,అధికారులు తదితర రంగాలలో రాణిస్తున్న వారిని గుర్తించి ఉగాది పురస్కారాలు,నల్ల వజ్రంఅవార్డులు ఇవ్వడం జరుగు తుందని అన్నారు.ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు,ఎమ్మెల్యేలు, సినీ,టీవీ నటీనటులను అతిథులుగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.నృత్య పోటీలలో పాల్గొనదలచిన కళాకారులు మార్చి 10లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని,మరిన్ని వివరాలకు 6281252369 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో కళోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు దామెర శంకర్, మేజిక్ రాజా, దయా నర్సింగ్, కనకం రమణయ్య, పి.చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలాబాక పాఠశాలలో సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠ

**-దాతల సహకారంతో ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు**
**డైట్. ప్రిన్సిపల్ మొండయ్య**



**చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 26 :** వీణవంక మండల పరిధిలోని ఎలబాక గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో గ్రామస్థుల,తలిదండ్రుల సహకారంతో ఘనంగా జరుపు కున్నారు.అలాగే పాఠశాలలో నూతనంగా ల్యాబ్,లైబ్రరీలను డైట్. ప్రిన్సిపల్ మొండయ్య చేతులు మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు.పిస్టా ఫౌండేషన్ టెక్సాస్-అమెరికా వారి రూ..ఒక లక్ష90వేలు దొనపాటి(కల్లెపు) సూర్యమ్మ - వీరారెడ్డి రూ..70వేలు తో ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.వారికి పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పిల్లలచేత వారి తల్లిదండ్రుల కు పాద పూజ చేయించారు.విద్యార్థుల చే సాంకృతిక కారక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శోభారాణి,గ్రామ సర్పంచ్ నల్లగోని సరోజన,హెచ్ఎం ఎం.అంజారెడ్డి,ఉపాధ్యాయులు పావని, సతీష్ కుమార్,సత్యం కడవెరుగు,బల్బీర్ సింగ్,మహేందర్,నర్సింహ రెడ్డి,పిస్టా ఫౌండేషన్ ప్రతినిధి కొండల్ రెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశానుసారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం పోలీస్‌వారి ఆధ్వర్యంలో శుక్రవారం తేది 27.02.2026 రోజున ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ నందు అశ్విని హాస్పిటల్ ఎల్లారెడ్డిపేట వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు, మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు టాక్సీ డ్రైవర్లు, ట్రావెల్స్ డ్రైవర్లు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి తెలిపినారు.

# సీనియర్ అసిస్టెంట్లకు ఏసిటిఓ ప్రమోషన్లు వెంటనే ఇవ్వండి



చురకలు విలేఖరి,హుజూరాబాద్, ఫిబ్రవరి, 25 : తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు ఏ సి టి ఓ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని తెలం గాణ వాణిజ్యపన్నుల శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎక్సైజ్ వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు కు తెలంగాణ వాణిజ్య పన్ను ల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. దాదాపు రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లకు సంబంధించిన సీనియార్టీ రోస్టర్ పాయింట్ ప్రకారం సీనియార్టీ తయారీ ఉంది కనుక ఆ యొక్క డివిజన్లో ఖాళీగా ఉన్న ఏసిటిఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఇదే శాఖలో కొన్ని నెలల క్రితం ఏ సి టి ఓ లకు డిసిటిఓ ప్రమోషన్లు ఇవ్వటం జరిగింది. అదే ఖాళీలలో మరియు ఈ మధ్యకాలంలో పదవి విరమణ పొందిన ఉద్యోగుల ఖాళీలను బట్టి సీనియర్ అసిస్టెంట్ల సీనియార్టీ ప్రకారం ఆ ఖాళీలలో వీరిని సీనియర్ అసిస్టెంట్లకు ఏసిటిఓ ప్రమోషన్ ఇచ్చి ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

# న్యాయం జరిగేంత వరకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

**-హత్య కేసు నమోదు చేసి సంఘటనలో పాల్గొన్న దోషులందరికి శిక్ష పడాలి**
**-స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన కులోన్మాదం మతోన్మాదం ఇంకా పెట్రేగిపోతునే ఉంది**
**-ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీల ఐక్య పోరాట సమితి సలహాదారు న్యాయవాది పసుల కృష్ణ**



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 26 : భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న కులోన్మాదం మతోన్మాదం ఇంకా పెట్రేగిపోతునే ఉందని ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీల ఎల్లారెడ్డిపేట మండల ఐక్య పోరాట సమితి సలహాదారు న్యాయవాది పసుల కృష్ణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం ఎదుట కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీల ఐక్య పోరాట సమితి రజక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని గురువారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ఐక్య పోరాట సమితి మండల సలహాదారు న్యాయవాది పసుల కృష్ణ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ లో జరిగిన పాప హత్య కేసులో అక్కడి పోలీసులు 8 మందిపై కేసులు నమోదు చేసి అందులో కేవలం ముగ్గురినే అరెస్టు చూపిన పోలీసులది కంటి తుడుపు చర్య అని ఆయన అన్నారు, 8 మంది పై హత్య కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపి పాప కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు, ఫిబ్రవరి 18వ తేదీన నాగర్ కర్నూల్ లోని దేవాలయం లోకి రజక కులానికి చెందిన ఆమే ఆమే భర్త కుటుంబ సభ్యులు కలిసి దర్శనానికి వెళ్ళగా పెత్తందారులు గుడిలోనికి వెళ్ళకుండా అడ్డుకోవడంతో పాటు ఆమె ప్రశ్నించినందుకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఆమెను ఆమె భర్తను కొట్టి పాపను తన్నడంతో పాప మరణించిందని ఆ పాప మరణానికి కారకులైన వారిని అక్కడి డిఎస్పి సీఐ ఎస్ఐ ఎస్పై లు హత్య నేరం కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టి బాధితులపైనే కేసులు నమోదు చేయడం ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు గతంలో కులోన్మాదం వల్ల చుండూరు కారంచేడు సంఘటనలు జరిగాయని ఇలాంటి సంఘటనలు జరగకుండా భారత రాజ్యాంగం అమలు చేసుకుంటున్న ఈ తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడు దేవాలయాల్లో దేవుని దర్శించుకునే హక్కు అందరికీ భారత రాజ్యాంగం ప్రకారం కల్పించబడిందన్నారు. ఎం ఆర్ పి ఎస్ మహాజన్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ , బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వరస కృష్ణా హరి, బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు కంచర్ల రాజు మాట్లాడుతూ కులం లేదు మతం లేదు అనే వక్తలు వారికి బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికైనా మీ మైండ్ సెట్ ను మార్చుకొని బుద్ధి తెచ్చుకోవాలని వారి హెచ్చరించారు. చైనా రష్యా ఇతర దేశాలతో పోటీపడే స్థాయిలో ఉన్న భారతదేశం కులోన్మాదం మతోన్మాదంతో పోటీ పడలేమన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షులు కంచర్ల నర్సింలు ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీల ఐక్య కార్యాచరణ కమిటీ మండల కన్వీనర్ బండారి బాల్రెడ్డి ప్రతినిధులు కదిరే భాస్కర్ గౌడ్ , సాయి ప్రేమ్ , ఎడ్ల రాజ్ కుమార్ ఎడ్ల సందీప్ , లింగాల సందీప్ , జి మల్లేశం, జి సురేష్ పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అంగూరి ప్రవీణ్, బీపేట మల్లేష్ మందాటి రాజు యాదవ్, మానుక నాగరాజు యాదవ్ దండు శ్రీనివాస్ ముదిరాజ్, రవి జుబేర్, జీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం

**- ఆసియా పారా గేమ్స్ 2026 భారత జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా సింగారపు బాబు నియామకం**



వాలీబాల్ కోచ్ శ్రీ సింగారపు బాబు 2026 ఆసియా పారా గేమ్స్ భారత

చురకలు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 26 : తెలంగాణ రాష్ట్రానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామానికి చెందిన అంతర్జాతీయ పారా సిట్టింగ్ జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జపాన్‌లోని ఐచి-- నగోయాలో నిర్వహించనున్న 2026 ఆసియా పారా గేమ్స్ కోసం భారత జట్టును ఎంపిక చేసే సాంకేతిక పరిశీలకుడు మరియు ఎంపిక కమిటీ సభ్యుడిగా ఆయనను అధికారికంగా నియమించింది. 2026 ఫిబ్రవరి 26 నుండి 28 వరకు నిర్వహించబడనున్న 14వ జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ ఛాంపియన్షిప్ (పురుషులు a మహిళలు) సందర్భంగా ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టు ఎంపిక ప్రక్రియ చేపట్టబడుతుంది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించి, సమర్థమైన భారత జట్టును రూపొందించే బాధ్యతను ఎంపిక కమిటీకి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల గ్రామం నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, దేశానికి సేవ చేయడం రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. సింగారపు బాబు నియామకం రాష్ట్ర క్రీడాకారులకు మరియు యువతకు ప్రేరణగా నిలుస్తోంది. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియాకు సింగారపు బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

# స్పందించిన సింగరేణి అధికారులు



చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 26 : రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయితీ పరిధిలోని వకీల్ పల్లె లో డ్రైనేజీ అస్తవ్యస్తమని గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పటేల్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఆర్ జి శ్రీ జి ఎం సుంకర మధుసూదన్ కు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో గురువారం సింగరేణి అధికారులు పరిశీలించారు. దీంతో జిఎం మధుసూదన్ స్వయంగా వకీల్ పల్లె ప్లాట్ లను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య రాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని మరమ్మతులు చేయిస్తానని మధుసూదన్ తెలిపారు. సమస్యపై స్పందించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఆర్.జి.3 జిఎం మధుసూదన్‌కు గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పటేల్ తో పాటు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

# వాణిజ్య పన్నుల శాఖలో సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు వెంటనే చేపట్టండి

**-ముజాహిద్ హుస్సేన్**

చురకలు విలేఖరి,హుజూరాబాద్, ఫిబ్రవరి, 25 : రాష్ట్రంలో వాణిజ్య పన్ను ల శాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారు దాదాపు పది సంవత్సరాల నుండి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నారని,వారికి ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయక పోవటం వలన వాణిజ్య పనుల ఉద్యోగులు మానసికంగా కుమిలిపోతున్నారని తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు వాణిజ్య ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఎం రఘునందన్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ వాణిజ్య పన్ను ల శాఖలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు రెండు నుండి మూడు సంవత్సరాల లోపు ఒక్కసారి బదిలీలు చేపట్టాలి దాన్ని ఈ శాఖలో దాదాపు పది సంవత్సరాల నుండి బదిలీ చేయకపోవటం వలన చాలామంది ఉద్యోగులు అనారోగ్యాలకు మానసికంగా కుమిలిపోతున్నారు కావున వీరిని వెంటనే బదిలీలు చేపట్టాలని గతంలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేసిన కమిషనర్లు నీతు కుమార్ ప్రసాద్ శ్రీదేవి కే హరిత మరియు ఇప్పుడు పనిచేస్తున్న కమిషనర్ ఎం రఘునందన్ రావు దృష్టికి ఈ సమస్య టిఎన్జీవోస్ సంఘం పక్షాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తీసుకొని వచ్చినారు ఎందుకు బదిలీలు కాలేదు అని కమిషనర్ ప్రశ్నించడం జరిగింది. కావున మీ యొక్క హయాంలో ఆయన తప్పకుండా ఈ సీనియర్ అసిస్టెంట్లకు వెంటనే బదిలీలు చేపట్టండి అని ఇప్పటి రెవెన్యూ ఎక్సైజ్ మరియు వాణిజ్య పన్నులు శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఎం రఘునందన్ రావు దృష్టికి ఈ సమస్య తీసుకొని రావటం జరిగింది తప్పకుండా ఈ యొక్క సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు చేపడుతానని హామీ ఇవ్వడం జరిగింది. చాలా సంవత్సరాల నుండి ఒకే ప్రాంతంలో పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీలు కాకపోవటం వలన సీనియర్ అసిస్టెంట్లు చాలా మంది మానసికంగా కుమిలిపోతున్నారు కావున వెంటనే దాదాపు పది సంవత్సరాల నుండి ఒకటే ప్రాంతంలో పనిచేస్తున్న ఈ ఒక్క సీనియర్ అసిస్టెంట్లకు వెంటనే బదిలీలు చేపట్టడానికి చొరవ తీసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు కు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

# బెట్టింగ్ యాప్‌కు మరో వ్యక్తి బలి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 26 : జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి బెట్టింగ్ యాప్కు బలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహేష్ బెట్టింగ్ యాప్లో పెట్టుబడి పెట్టి నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడని,బెట్టింగ్ యాప్లో రూ.25లక్షల వరకు పెట్టినట్లు తెలిసింది. పెట్టిన డబ్బులు తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇనుప రాడుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. బెట్టింగ్ యాప్లను ప్రభుత్వం అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుని కుటుంబాన్ని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులుగా మారొద్దు

**-కరీంనగర్ సిపి గౌస్ ఆలం సింగాపురం కిట్స్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 26 :** ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలా మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తు న్నారని,క్షతగాత్రులుగా మారుతున్నారని, తద్వారా వారి కుటుంబాలు జీవితాంతం నరకయాతన అనుభవిస్తున్నాయని ఈ పరిస్థితులు మారాలని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గురువారం హుజూరాబాద్ మండలం సింగాపురంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థుల కు రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి స్థానిక ఏసిపి వాసంశెట్టి మాధవి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపి గౌస్ ఆలం హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు.ప్రతి ఒక్కరూ వేగనియంత్రణ పాటించాలని, తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని,వాహనాలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని,భారీ వాహనాలను ఓవర్ టేక్ చేయవద్దని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు,పాదచారులు రోడ్డు దాటేటప్పుడు కచ్చితంగా అటువైపు నుండి ఇటువైపు నుండి వాహనాలు వస్తున్నాయా లేదా అన్నది పరిశీలించిన తర్వాతే నిర్ధారించుకొని దాటాలని కోరారు.కారులో ప్రయాణించే వారు విధిగా బెల్టు ధరించాలని,మిర్రర్ లో వెనుకనుండి వచ్చే వాహనాలు చెక్ చేసుకోవాలని ఎప్పటికప్పుడు బ్రేక్ చెక్ చేసుకోవాలని వాహన కండిషన్ పరిశీలించుకోవాలని కోరారు.లాంగ్ డ్రైవింగ్ చేసేటప్పుడు కొద్దిసేపు రెస్ట్ తీసుకోవాలని,నిద్ర లేకుండా వాహనాలు నడపవద్దని అన్నారు.ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలని, మూలమలుపుల వద్ద వేగ నియంత్రణ పాటించాలని,విద్యార్థులు ఇళ్లల్లో తమ తల్లిదండ్రులకు కూడా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు జరిగిన విధానాలను అలాగే పాటించాల్సిన సూచనలను,గతంలో జరిగిన ప్రమా దాల వీడియోలను,తీసుకోవలసిన జాగ్రత్తలను, ప్రమాదాల గణాంకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పలువురికి లైసెన్సులను కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు.అలాగే ఇటీవల గ్రామపంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఎన్సిసి క్యాడేట్లకు ఆయన ప్రశంస పత్రాలు అందించారు.విద్యార్థులతో రోడ్డు భద్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ను ప్రిన్సిపల్ డాక్టర్ కందుకూరి శంకర్, రిజిస్టర్ డాక్టర్ వి రాజేశ్వరరావు ఘనంగా సన్మానించారు. అనంతరం సింగాపురం సమీపంలోని ఎరుకల గూడెం క్రాసింగ్ వద్ద హెచ్చరిక బోర్డులను పోలీసు కమిషనర్ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్, హుజురాబాద్ పట్టణ సిఐ కరుణాకర్, రూరల్ సిఐ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పి,యం సంసద్ క్రీడా మహోత్సవ పోటీల్లో

# పాల్గొనడానికి పేర్ల నమోదుకు నేడే చివరి రోజు




**చురకలు విలేఖరి,కరీంనగర్, ఫిబ్రవరి, 25 :** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరగనున్న ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవ పోటీల్లో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం వరకు అవకాశం ఉందని,ఆసక్తి కలిగిన క్రీడాకారులు , టీంలు పేర్లు నమోదు చేసుకోవాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోఆర్డినేటర్స్ గుజ్జు శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి లు ఓ ప్రకటనలో తెలిపారు. ఖేలో ఇండియాలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి లోక్ సభ నియోజకవర్గంలో క్రీడా పోటీలు నిర్వహించాలన్న పిలుపుమేరకు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవ ప్రోగ్రాం నిర్వహించాలని తలపెట్టారని, ఆ కరెంట్ ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ పార్లమెంట్లోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడాంశాలలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ యువతి యువకులకు ఈ ప్రోగ్రాం ఓ మంచి వేదిక అవుతుందన్నారు. మార్చ్ ఒకటి నుండి 3 వ తేదీ వరకు అసెంబ్లీ స్థాయిలో , మార్చి 5 నుండి 7 వరకు పార్లమెంటు స్థాయిలో పోటీల నిర్వహణ ఉంటుందని, మార్చి 8న కరీంనగర్లో బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంటు పరిధిలో జరిగే క్రీడల్లో పాల్గొనాలనుకునే టీంలు, క్రీడాకారులు మరింత సమాచారం కోసం 9866406565, 98669 04669 చరవాణి నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# జిల్లా పూర్తిస్థాయి కలెక్టర్‌గా గరిమ అగర్వాల్ నియామకం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా పూర్తిస్థాయి కలెక్టర్‌గా గరిమ అగర్వాల్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన విభాగం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి గరిమ అగర్వాల్ ప్రస్తుతం జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తూ, కొంతకాలంగా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తు న్నారు.ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆమె జిల్లా పరిపాలనపై సమగ్ర పట్టు సాధించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశారు. వివిధ శాఖల పనితీరును సమీక్షిస్తూ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణలో క్రమశిక్షణతో వ్యవహరించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు.జిల్లా యంత్రాంగాన్ని సమన్వయంతో నడిపిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. పరిపాలనలో పారదర్శకత, వేగం, సమర్థతకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆమెపై ప్రభుత్వం విశ్వాసం ఉంచి పూర్తిస్థాయి కలెక్టర్‌గా నియమించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.గరిమ అగర్వాల్ పూర్తిస్థాయి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు. ఆమె నాయకత్వంలో జిల్లా అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

పి,యం సంసద్ క్రీడా మహోత్సవ పోటీల్లో పాల్గొనడానికి పేర్ల నమోదుకు నేడే చివరి రోజు..

**చురకలు విలేఖరి,కరీంనగర్, ఫిబ్రవరి, 25 :** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరగనున్న ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవ పోటీల్లో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం వరకు అవకాశం ఉందని,ఆసక్తి కలిగిన క్రీడాకారులు,టీంలు పేర్లు నమోదు చేసుకోవాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోఆర్డినేటర్స్ గుజ్జు శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి లు ఓ ప్రకటనలో తెలిపారు. ఖేలోఇండియాలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి లోక్ సభ నియోజకవర్గంలో క్రీడా పోటీలు నిర్వహించాలన్న పిలుపుమేరకు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవ ప్రోగ్రాం నిర్వహించాలని తలపెట్టారని, ఆ కరెంట్ ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ పార్లమెంట్లోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడాంశాలలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ యువతి యువకులకు ఈ ప్రోగ్రాం ఓ మంచి వేదిక అవుతుందన్నారు. మార్చ్ ఒకటి నుండి 3 వ తేదీ వరకు అసెంబ్లీ స్థాయిలో , మార్చి 5 నుండి 7 వరకు పార్లమెంటు స్థాయిలో పోటీల నిర్వహణ ఉంటుందని, మార్చి 8న కరీంనగర్లో బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంటు పరిధిలో జరిగే క్రీడల్లో పాల్గొనాలనుకునే టీంలు, క్రీడాకారులు మరింత సమాచారం కోసం 9866406565, 98669 04669 చరవాణి నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## పేదింటి వివాహానికి కౌన్సిలర్ దంపతుల చేయూత

**-26వ వార్డులో రూ.10,116 అందించిన కేసిరెడ్డి లావణ్య నర్సింహారెడ్డి దంపతులు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్, ఫిబ్రవరి 26 :** హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 26 వార్డులో పేద కుటుంబాలకు చేయూతగా ఉంటామని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన భరోసా మేరకు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య -నర్సింహారెడ్డి దంపతులు ఓ నిరుపేద కుటుంబంలో వివాహానికి ఆర్థిక సహా యం అందించి అండగా నిలిచారు.26వ వార్డుకు చెందిన నారోజు రాజ్యలక్ష్మి-రత్నాచారి దంపతుల కుమార్తె తరుణి వివాహము కందుకూరి రాజేందర్ తో గురువారం స్థానిక మధువని గార్డెన్‌లో జరిగింది.ఈ వివాహ వేడుకకు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నర్సింహా రెడ్డి దంపతులు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి రూ.10,116 /-ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి శు భాకాంక్షలు తెలిపారు.పేదింటి వివాహానికి ఆర్థిక సహాయం అందించిన కౌన్సిలర్ లావణ్యనర్సింహారెడ్డి దంపతులను పలువురు అభినందించారు.

## త్రాగునీటి సమస్య లేకుండా చేస్తాం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 26 :** కమాన్‌పూర్ మండలం పెంచికలపేట గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా చూస్తాం అని సర్పంచ్ పల్లె మాధవి నారాయణ అన్నారు.చాలా రోజులుగా పనిచేయని చేతిపంపుకు గురువారం రిపేర్ చేయించారు.రానున్న వేసవికాలం అనే దృష్టిలో పెట్టుకొని బోర్ కు మరమతులు చేయించడం జరిగిందని పేర్కొన్నారు.అలాగే గ్రామంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ గ్రామంలో పరిశీలించారు.పైప్ లైన్ సమస్య ఉన్నచో తమ దృష్టికి తీసుకు రావాలని ఏఈ కోరారు.వేసవిని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని ఏఈ మధు తెలిపారు. ఇందులో గ్రామ కార్యదర్శి సూది రెడ్డి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

### వికసిత్ భారత్ 2026 పోస్టర్ రిలీజ్ చేసిన

# సెంట్రల్ మినిస్టర్ బండి సంజయ్




చురకలు ప్రతినిధి కరీంనగర్ **ఫిబ్రవరి 26 :** వికసిద్భారత్ కరీంనగర్ జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ 2026 పోటీలకు గాను పోస్టర్ని సెంట్రల్ మినిస్టర్ బండి సంజయ్ రిలీజ్ చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించి ఎమర్జెన్సీ పై తమ అభిప్రాయాలను ఆలోచనలను రాజ్యాంగబద్ధంగా ఏర్పడే పరిస్థితులను సవివరంగా వ్యక్తపరచాలని విద్యార్థులను ఉద్దేశించి కోరారు. వికసిద్భారత్ 2026 జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలను 18 నుండి 25 సంవత్సరాల వయసు గల యువతి యువకులకు "50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ : లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ" అనే విషయంపై మూడు నిమిషాల పాటు హిందీ ,ఇంగ్లీష్ ,తెలుగు భాషలలో మాట్లాడడానికి అవకాశం కల్పించారు. ఈ జిల్లాస్థాయి పోటీలకు ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 28 ఫిబ్రవరి 2026 న ఉదయం 9 గంటల నుండి 6 గంటల వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ తెలిపారు. ఈ పోటీలో పాల్గొనేవారు ముందుగా మై భారత్ పోర్టల్ లో విక సిద్ భారత్ ఈవెంట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అన్నారు. టిజిసి జిటిఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వ్యక్తపరచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేరా యువ భారత్ జిల్లా అధికారి ఎం వెంకట రాంబాబు గారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కరీంనగర్ జిల్లా పేరు ప్రఖ్యాతులను జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లేలా తమ ప్రతిభను ప్రదర్శించాలి అన్నారు. విద్యార్థులంతా నిస్సంకోచంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పల్స్ పి.నితిన్ పాఠక్, టి. రాజయ్య, వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల సమన్వయకర్త బి. ఎలిజబెత్ రాణి అధ్యాపకులు , ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీనివాస్ రెడ్డి, సత్య ప్రకాష్ ,డాక్టర్ కే అర్జున్, వెంకటేశ్వర్లు ,రాజేందర్ రాజేష్ తదితర అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### కరీంనగర్ నూతన కలెక్టర్గా

# చిత్రా మిశ్రా నియామకం

**-కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ**



చురకలు ప్రతినిధి కరీంనగర్ **ఫిబ్రవరి 26 :** కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ గా బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిన్న రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నేడో, రేపో కలెక్టర్గా చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరించనున్నారు. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన చిత్రా మిశ్రా తెలంగాణ క్యాడర్కు చెందిన 2019 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిని చిత్రా మిశ్ర ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటిడిఏ పిఓ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నాగర్కర్నూల్లో శిక్షణ తీసుకొని, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, నిజామాబాద్, మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్ గా బాధ్యతలు నిర్వర్తించారు.

# పట్టణాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుంది

**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**-బాధ్యతలు స్వీకరించిన జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**



చురకలు ప్రతినిధి, జగిత్యాల, **ఫిబ్రవరి 26 :** జగిత్యాల పట్టణాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్గా సమీండ్ల వాణి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ కు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణ పారిశుధ్యం, పచ్చదనం టౌన్ ప్లానింగ్, పట్టణ ప్రధాన సమస్యలపై నూతన పాలకవర్గం దృష్టి సారించాలన్నారు. వార్డులో సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. త్వరిత గతిన జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రధాన సమస్యలు, బడ్జెట్ కె టాయింపుల పై చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ స్పందన, అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



**-ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలి**

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

చురకలు విలేకరి, ధర్మపురి, **ఫిబ్రవరి 26 :** శ్రీలక్ష్మి నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం గోదావరి నది తీర ప్రాంతాలు లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణం, కళ్యాణ మండపం కోనేరు ఇసుక స్తంభం, పలు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, ధర్మపురిలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు (జాతర)-2026 గురువారం ధర్మపురి తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్తో కలిసి నిర్వహిం చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలనీ సూచించారు.రవాణా,ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కంట్రోల్రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్,ఆరోగ్య శిబిరాలు మరియు అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించు కోవాలని సూచించారు. బ్రహ్మోత్స వాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, కేటాయించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా,సమన్వయంతో నిర్వహించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.ఈ పరిశీలనలో ఆర్డీవో మధుసూదన్, డిఆర్డిఓ,డిపిఆర్,ఈఈ ఆర్డబ్ల్యూఎస్, సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, కౌన్సిలర్లు,దేవస్థాన కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు,మున్సిపల్ కమిషనర్, దేవస్థాన ఈవో,తహసీల్దార్లు, ఎంపిడివో లు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి కోసం బిజెపి పోరాటం

**-డంపు యార్డ్ నిర్మించొద్దు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**-హుజురాబాద్ లో బిజెపి మునిసిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం**



చురకలు ప్రతినిధి హుజురాబాద్ **ఫిబ్రవరి 26 :** హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి , సమస్యల పరిష్కారం కోసం గళం విప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బీజేపీ కౌన్సిలర్లకు సూచించారు. హుజురాబాద్ మున్సిపాలిటీ కి ఎన్నికైన నూతన కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. ఈ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి కోసం బిజెపి కౌన్సిలర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ అధికార పగ్గాలు కాంగ్రెస్ చేతిలో ఉన్నాయని, రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధికారంలో ఉందని కానీ పట్టణ అభివృద్ధి పట్ల తగిన చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ల అయినా హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ప్రతిపక్ష స్థానంలో బిజెపి కౌన్సిలర్లే ప్రజలకు బాటగా నిలిచి , వారి సమస్యల పరిష్కారం, పట్టణాభివృద్ధి కోసం నిరంతర కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హుజురాబాద్ మున్సిపాలిటీ శివారులో సిరిసపల్లి రోడ్డులో డంపు యార్డు ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మూడు ఉమ్మడి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించిన మొత్తం చెత్తను ఇక్కడికి తరలిస్తే హుజురాబాద్ భవిష్యత్తుకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రజలను , హుజురాబాద్ భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డంపు యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విరమించుకోకపోతే ప్రజా పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు కౌన్సిలర్లు కొలుగూరి సుమలత సుమన్, దామెర అనూష అనురాగ్, పంజాల మనోజ్, తూర్పాటి లక్ష్మి దుర్గ రాజు, కొండ ప్రశాంతి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, బిజెపి మాజీ కౌన్సిలర్లు పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

